

తుది దశకు సమగ్ర సర్వే

- కాగజ్‌నగర్‌లో 97శాతం పూర్తి
- వివరాలు అందించేందుకు కొంతమంది విముఖత


సర్వే తీరును పరిశీలిస్తున్న కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా(ఫైల్)

కాగజ్‌నగర్ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని చేపడుతు తున్న సమగ్ర కుటుంబ కుల గణన సర్వే నియోజక వర్గంలో తుది దశకు చేరుకుంది. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో ఎన్యూమరేటర్లు విద్య, ఉపాధి, రాజకీయ, వివరాలను సేకరిస్తున్నారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో ఈనెల 8న ప్రారంభమైన సర్వే పూర్తిదశకు చేరుకొంది. ఇప్పటికే 95శాతం సర్వే పూర్తి చేసిన అధికారులు, సిబ్బంది సోమవారం లోగా పూర్తి స్థాయిగా చేస్తామని పేర్కొన్నారు. సర్వే వివరాలను ప్రతీరోజు ఎన్యూమరేటర్లు అందిస్తున్నారు. స్థానిక ఆర్పీలు, ఉపాధ్యాయులు, తదితర సిబ్బంది ఎప్పటికప్పుడు వాటిని భద్రపరుస్తున్నారు.

మున్సిపాలిటీలో 15000 ఇండ్ల సర్వే.

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో 15820ఇండ్లు సర్వే చేస్తున్నారు. మొత్తం ఇండ్లు సర్వే చేసేందుకు 130 ఎన్యు మరేటర్లకు రోజుకు 150ఇండ్ల చొప్పున కేటాయించారు. ఒక్కో ఎన్యూమరేటర్ 130నుంచి 150గృహాల్లో సర్వే చేపడుతున్నారు. మున్సిపాలిటీలో 30వార్డులకు గానూ 133 బ్లాకులు ఏర్పాటు చేశారు. ఈ సర్వే క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు మున్సిపల్ కమిషనర్ అంజయ్య, మేనేజరు పెద్దింటి క్రాంతి తదితర అధికారులను నియమించారు.

వందశాతం పూర్తిచేస్తాం.
-అంజయ్య, మున్సిపల్ కమిషనర్

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో వందశాతం సర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే 97శాతం పైగా గణన పూర్తిచేశాం. సోమవారం వరకు మిగిలిన 500 ఇళ్ల డాటా పూర్తిగా సేకరించి సమగ్ర కుటుంబ కుల గణన సర్వేను పూర్తి చేస్తాం.

వివరాలు అందించేందుకు విముఖత

కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో కొన్నిచోట్ల పూర్తిస్థాయి వివ రాలను అందించేందుకు కొంతమంది విముఖత వ్యక్తం చేస్తున్నారు. అయితే వీరికి అవగాహన కల్పించి సర్వే సక్సెస్ అయ్యేవిధంగా కృషిచేస్తున్నారు. సర్వేలో భాగంగా ఇప్పటికే అదనపు కలెక్టర్ దీపక్‌తివారి, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా పలు వార్డుల్లో పర్యటించి అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. ఆధార్ కార్డు, వాహనాల వివరాలు, ఇతర కొన్ని వివరాలను అందించేందుకు కొన్ని వార్డుల్లో ప్రజలు నిరాకరిస్తుండగా మరికొన్ని వార్డుల్లో ఇంకా సర్వేకోసం స్టిక్కరింగ్, సర్వే చేసేందుకు ఎన్యు మరేటర్లు పర్యటించలేదని పేర్కొంటున్నారు.

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం


అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జడ్జి కె యువరాజ

ఆసిఫాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని లుంబిని దీక్ష భూమి ప్రాంగణంలో ఆదివారం సమతా భారత ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యకరమంలో జిల్లా న్యాయ సేవఅధికార సంస్థ సెక్రెటరీ జడ్జి కె యువరాజ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రపంచంలోకెల్లా మహోన్నతమైనదని అన్నారు. రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతిఒక్కరూ కొనసాగించాలన్నారు. భారతరాజ్యాంగ పీఠిక మనదేశ ఔన్నత్యానికి ప్రతీకని ఆధునిక ప్రజాస్వామ్య చరిత్రలో విశిష్టమైనదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మినారాయణ, ప్రొఫెసర్ గోపి, సమతా భారత్ ఐక్యవేదిక ప్రతినిధులు అన్నరావు, ఆనంద్‌రావు, టీమాజీ, సంతోష్, ప్రవీణ్‌కుమార్, హోక్టు తదితరులు పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ పోస్టర్ల విడుదల


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ నాయకులు

ఆసిఫాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల26న నిర్వహించే చలో హైదరాబాద్ పోస్టర్లను ఆదివారం ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకుడు కేశవరావు మాట్లాడుతూ దివ్యాం గులకు పెన్షన్ రూ.6వేలకు పెంచాలని మహాధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, ఇస్లాంబీన్ హసన్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ సఫారీకి ఉపాధ్యాయుల ఎంపిక


వడ్లూరి రాజేష్


ఎం తిరుపతయ్య

ఆసిఫాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయుడు వడ్లూరి రాజేష్, కాగజ్‌నగర్ పెట్రోల్‌పంపు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఉపాధ్యాయుడు ఎం తిరుపతయ్య అస్సాం రాష్ట్రంలోని గుహవాటి ఐఐటీలో నవంబరు 29నుంచి డిసెంబరు 3వరకు నిర్వహించే అంతర్జాతీయ సైన్స్ సఫారీ, వైజ్ఞానిక సైన్స్ లిటరేచర్ ఫెస్టివల్‌కు ఎంపికయ్యారు.

సర్వే సమాచారాన్ని పోర్టల్‌లో నమోదు చేయడం కీలకం

- కలెక్టర్‌తో వీడియోకాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క


వీసీలో పాల్గొన్న కలెక్టర్, సబ్ కలెక్టర్, డీఆర్వో

ఆసిఫాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో సేకరించిన సమాచారాన్ని ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయడం కీలకమైన అంశం అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం జార్ఖండ్ రాజధాని రాంచి ఉంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా అన్నిజిల్లాల కలెక్టర్లు, అదనపుకలెక్టర్లు, అధికారులతో సమగ్ర ఇంటింటి సర్వేపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే డేటా ఎంట్రీ చాలా కీలకమైందని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. ప్రభుత్వం ఈ అంశం దృష్టి కేంద్రీకరించిందని తెలిపారు. సర్వేదశలో పట్టణ ప్రాంతాల్లో డోర్‌లాక్, ఇంటి వద్ద అందుబాటులో లేకపోవడం జరిగినట్లయితే సంబంధిత కుటుంబ సభ్యులకు ఫోన్‌కాల్ చేసి సర్వే గురించి తెలియజేసి వివరాలను సేకరించాలని తెలిపారు. గ్రామీణప్రాంతాల్లో వలసలు మొదలైన వారి వివరాలను జాగ్రత్తగా క్రమబద్ధీకరించుకోవాలని తెలిపారు. ఈ వీసీలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక


హమ్‌రాజ్

కౌటాల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన హమ్‌రాజ్ ఈనెల 25 నుంచి 28వరకులక్నోలో జరిగే జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల హనుమకొండ జేఎన్ఎస్‌గ్రౌండ్‌లో నిర్వహించిన నేషనల్‌మీట్‌లో ప్రతిభకబర్చి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కాగా హమ్‌రాజ్ రుక్మాపూర్ సైనిక్‌స్కూల్‌లో 9వతరగతి చదువుతున్నాడు. ఈసందర్భంగా హమ్‌రాజ్‌ను పలువురు అభినందించారు.

డేటా ఎంట్రీ పకడ్బందీగా చేపట్టాలి: డీఆర్వో


డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న డీఆర్వో లోకేశ్వరరావు

వాంకిడి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే డాటాఎంట్రీని పకడ్బందీగా చేపట్టాలని డీఆర్వో లోకేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం మండలపరిషత్ కార్యాలయంలో జరుగుతున్న ఆన్‌లైన్ డాటాఎంట్రీని పరిశీలించారు. డాటా ఎంట్రీ సమయంలో ఎలాంటి తప్పులు దొర్లకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వివరాలను ఎప్పటికప్పుడు రోజువారీగా కలెక్టర్ కార్యాలయానికి పంపించాలని ఆపరేటర్లకు సూచించారు. అనంతరం మండలంలోని పలు పోలింగ్‌బూత్‌లను సందర్శించి ఓటరు నమోదును పరిశీలించారు. అనంతరం గ్రంథాలయాన్ని సందర్శించి పుస్తకాల వివరాలు తెలుసుకున్నారు. గ్రంథాలయంలో ఉద్యోగాలకోసం సన్నద్ధవుతున్న యువకులతో మాట్లాడి అందుబాటులో ఉన్నపుస్తకాలతో చదువుకుంటూ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని అన్నారు. ఆయనవెంట ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ రియాజ్ అలీ, గిర్దావర్ మాజీద్, ఎంపీవో అజీజుద్దీన్ తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

ఆసిఫాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులకు 8వతరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అయిదు సంవత్సరాలు కేంద్రప్రభుత్వం ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్ ఇవ్వడానికి నిర్వహించే నేషనల్ మీన్స్‌కం మెరిట్‌స్కాలర్‌షిప్ పరీక్ష జిల్లాకేంద్రంలో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. మొత్తం 483మంది విద్యార్థులకుగాను 431మంది విద్యార్థులు హాజరైనట్లు పరీక్షల సహాయసంచాలకుడు ఉదయ్‌బాబు తెలి పారు. పరీక్షాకేంద్రాల వద్ద సీఐ రవీందర్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

చదరంగంతో మానసిక ప్రశాంతత

- డీఎస్‌వో మీనారెడ్డి

ఆసిఫాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చదరంగం ఆడటం వల్ల మానసిక ప్రశాంతత కలుగుతుందని డీఎస్‌వో మీనారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని టీడబ్ల్యూ బాలికల స్పోర్ట్స్‌మోడల్ స్కూల్‌లో నిర్వహించిన ఉమ్మడిఆదిలాబాద్ జిల్లా చెస్‌చాంపియన్ షిప్ పోటీల్లో బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసిఫాబాద్‌లో పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మారుమూల గ్రామాల్లో కూడా క్రీడాకారులను ప్రోత్సహించడానికి జిల్లా చెస్‌అసోసియేషన్ కృషిచేయడం అభినందనీయమ న్నారు. చదరంగంలో రాణించడం వల్ల మేధాశక్తి, వ్యూహాత్మక, కళానైపుణ్యం పెంపొందించుకోవచ్చన్నారు. ఈక్రీడల్లో రాణిస్తున్న వారికి విద్య, ఉద్యోగఅవకాశాలు ప్రత్యేక రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు. విద్యార్థులు ఈఅవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానంచేశారు. కార్యక్రమంలో జిల్లా చెస్ అసోసియేషన్ చైర్మన్ కనకయ్య, జిల్లా అధ్యక్షుడు సంపత్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఉపేందర్, మాజీఎంపీపీ మల్లికార్జున్, ఏసీఎంవో ఉద్దవ్, జిల్లా ప్రధానకార్యదర్శి కల్పన, టోర్నమెంట్ కన్వీనర్ రవీందర్, సహాయ కార్యదర్శి తిరుపతి, శృతిక, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని పరామర్శించిన ఎమ్మెల్యే


విద్యార్థి శైలజను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వాంకిడి బాలికల ఆశ్రమ పాఠశాలలో అస్వస్థతకు గురై హైదరాబాద్ పట్టణంలోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 9వతరగతి విద్యార్థిని శైలజను ఆదివారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి పరామర్శించారు. ఈసందర్భంగా విద్యార్థిని ఆరోగ్యంపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అధైర్యపడవద్దని త్వరలోనే కోలుకుంటుందని విద్యార్థిని తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. ఆమెవెంట ట్రైబల్ వెల్ఫేర్ డీడీ దిలీప్‌కుమార్ ఉన్నారు.

విద్యార్థులకు స్వెటర్ల పంపిణీ


విద్యార్థులతో డాక్టర్ సునంద

కెరమెరి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బాబేఝరి గిరిజన సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థులకు ఆదివారం జైనూరు ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారిణి డాక్టర్ సునంద స్వెటర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద గిరిజన విద్యార్థులకు చలినుంచి తట్టుకోవడానికి సేవా కార్యక్ర మంలో భాగంగా స్వెటర్లు పంపిణీ చేశామన్నారు. ఈ సందర్భంగా 150మంది విద్యార్థులకు స్వెటర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం జంగు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా జిల్లాస్థాయి సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు


పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు

ఆసిఫాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గిరిజన క్రీడాపాఠశాలలో ఆదివారం సబ్‌జూనియర్ బాల బాలికల అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వంద మంది క్రీడాకారులు పాల్గొనగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు డిసెంబరు1న మంచిర్యాలలో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్‌పోటీల్లో పాల్గొనున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి శంకర్, మల్లికార్జున్‌యాదవ్, ట్రైబల్ వెల్ఫేర్‌డీడీ రమాదేవి, ఏసీఎంవో ఉద్దవ్, మీనా రెడ్డి, లక్ష్మణ్, శ్రీనివాస్, విద్యాసాగర్, హరికృష్ణ, స్వప్న, సౌందర్య, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు


కుమరం భీం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

పెంచికలపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): అన్ని వేళలా ఆదివాసీలకు అండగా ఉంటానని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. ఆదివారం మండ లంలోని పోతెపల్లి గ్రామంలో కుమరంభీం విగ్రహాన్ని ఎమ్మెల్సీ దండేవిఠల్, భీమనుమడు సోనేరావుతో కలిసి సంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జల్ జంగల్ జమీన్ కోసం భీంచేసిన పోరాటం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిదాయక మన్నారు. కార్యక్రమంలో నాయకులు పోశం, గణపతి, చంద్రమౌళి, పుష్పలత, పోశం, హర్షద్‌హుస్సేన్, చిన్నయ్య, ఓం ప్రకాష్, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్


స్పోర్ట్స్ కరాటే కమిటీ సభ్యులు

కాగజ్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్పోర్ట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్టు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష పరిశీలకుడు శేఖర్ ప్రకటించారు. అధ్యక్షుడుగా హితేష్ అగర్వాల్, ప్రధానకార్యదర్శిగా దేవయ్య, కోశాధికారిగా వెంకటేశంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఆయన తెలిపారు. ఉపాధ్యక్షుడుగా శివ, దొమ్మటి రమేష్, సంయుక్త కార్యదర్శి కిరణ్, రామరాజు, రాము, వెంకన్న ఎన్నికైనట్టు పేర్కొన్నారు. అలాగే ఆసిఫాబాద్ నుంచి దివ్యభారతి, జైనూరు నుంచి గంగాదేవి ఈసీ సభ్యులుగా ఎన్నికైనట్టు ప్రకటించారు.

దళితులపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- లేదంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళన
- మాలమహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి


కరపత్రాలు విడుదల చేస్తున్న పసుల రామ్మూర్తి, తదితరులు

కాగజ్‌నగర్ టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): దహెగాం మండలంలోని కొత్మీర్ గ్రామంలో ఇటీవల జరిగిన దళితులపై దాడి విషయంలో నిందితులపై చర్యలు తీసుకోకుంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేస్తామని మాలమహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి హెచ్చరించారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్మీర్ గ్రామంలో ఈనెల 8న రెడ్డిరమేష్‌ని కులం పేరుతో దూషించిన అదేగ్రామానికి చెందిన సిద్ధం సంతోష్‌పై ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడంలో దహెగాం ఎస్సై తాత్సారం చేశారన్నారు. అదే విషయంలో నిందితుడు సిద్ధం సంతోష్ ఫిర్యాదు చేస్తే కేసు వెంటనే నమోదు చేయడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. మహిళలతోపాటు గ్రామస్థులను కులంపేరుతో దూషించిన రెడ్డిరమేష్‌తోపాటు ఐదుగురు గ్రామస్థులైన దళితులకు న్యాయం చేయాలని అడిగితే మరో ఫిర్యాదు ఇవ్వాలని ఈనెల 11న ఎస్సై తెలిపారన్నారు. ఈ విషయంపై కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజంను కలిసి వివరించగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కులంపేరుతో దూషించిన రెడ్డి రమేష్ తదితరులపై కేసు నమోదు చేసి, సంతోష్‌పై మాత్రం నామమాత్రపు కేసు నమోదు చేయడంతోనే ఎస్సై కుమ్మక్కైనట్లు అర్థం అవుతోందన్నారు. ఈ విషయంలో ఎస్సీ, ఎస్టీ చైర్మన్‌తో పాటు, ఎస్పీకి సైతం ఫిర్యాదు చేశామని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో మాల మహానాడు ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి కాసర్ల యాదగిరి, నాయకులు సోగాల కిష్టయ్య, దుంద్ర శ్రీనివాస్, ఎరుకల శ్రీనివాస్, రత్నం, నాగరాజు, సుమన్, తిరుపతి గ్రామస్థులు పాల్గొన్నారు.

హలో మాల.. ఛలో హైదరాబాద్ కరపత్రాలు విడుదల

డిసెంబరు 1న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే హలో మాల.. చలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతం చేయాలని మాలమహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి కోరారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర అధ్యక్షుడు జూపాక సుధీర్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. ఈ మాలల సింహ గర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కరపత్రాలను వారు ఆవిష్కరించారు.

రోడ్లపైనున్న బోర్డులను తొలగించాలి

కాగజ్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రోడ్డుపై ఉన్న దుకాణాల బోర్డులను వెంటనే తొలగించాలని పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం ఆయన మార్కెట్‌లో పర్యటించి పలు దుకాణాల యాజమానులను ఈ విషయమై హెచ్చరించారు. రోడ్డుపై ట్రాఫిక్ సమస్య రాకుండా బోర్డులను వెంటనే తొలగించాలని సూచించారు.


వ్యాపారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సీఐ రాజేంద్ర ప్రసాద్

క్రైం కార్నర్

సంకారం గ్రామంలో గుప్తనిధుల తవ్వకాలు


ఇంట్లో తవ్విన గుంత

చెన్నూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సంకారం గ్రామంలో గుప్త నిధులు తవ్వుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వ హించారు. గ్రామానికి చెందిన తగరం మహేష్‌కు పాత ఇల్లు ఉంది. ఆది వారం ఇంట్లో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుపుతుండగా గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కొయ్యడ గ్రామానికి చెందిన మెరుగు నరేష్, బెల్లంపల్లికి చెందిన బండి శ్రీకాంత్, ఎర్రగుంటపల్లికి చెందిన దుర్గం రాజసమ్మయ్య, మంథనికి చెందిన కట్టెపు హరికృష్ణలను అదుపులోకి తీసుకున్నామని సీఐ రవీందర్ తెలిపారు. తవ్వకానికి సంబంధించిన వస్తువులు, పూజా సామగ్రి స్వాధీ నం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఇంటి యజమాని తగరం మహేష్‌తో పాటు మరో ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు. వీరి వద్ద నుంచి ఒక ఆటో, ఆరు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

ముఠాను అదుపులోకి తీసుకున్న అటవీ అధికారులు


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

పెంచికలపేట, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): లోడ్‌పల్లి బీట్‌పరిధిలోని అటవీ ప్రాంతంలో పురాతన సిద్ధేశ్వర గుట్ట ప్రాంతంలో శనివారం రాత్రి గుప్త నిదుల ముఠాను అటవీశాఖాధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఎఫ్ఆర్వో అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. అందిన సమాచారం మేరకు గస్తీ నిర్వహిస్తుండగా రెండుకార్లలో వచ్చిన బొంబాయి గూడకు చెందిన పగిడి వసంత్‌రావు, ఎలగుందలకు చెందిన కొట్టే ప్రవీణ్‌కుమార్, కోతిరాంపూర్ చెందిన ఆలకుంట వెంకన్న, బావుపేటకు చెందిన దావ సురేందర్, నల్వాలా అంజన్న, కరీంనగర్‌కు చెందిన గడిపల్లి రమేష్‌ను పట్టుకుని అటవీశాఖ కార్యాలయానికి తరలించామన్నారు. విచారణలో గుప్తనిధుల తవ్వకం కోసం వచ్చినట్లు వారు అంగీకరించినట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు. డీఆర్వోలు జమీల్ అహ్మద్, అబ్దుల్ ముసావీర్, ఎఫ్ఎస్‌వోలు వేణుగోపాలావు, అస్మా, ఎఫ్‌బీవోలు లచ్చన్న, మహేష్, సతీష్, వాచర్లు పాల్గొన్నారు.

పేకాటస్థావంపై దాడి.. పదిమందిపై కేసు నమోదు

వాంకిడి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని బంబార గ్రామ శివారులో పేకాట శిబిరంపై ఆదివారం ఎస్సై ప్రశాంత్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో పదిమంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.4500 నగదును స్వాధీన పర్చుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఎక్కడైనా పేకాట ఆడినట్లు తెలిస్తే 8712670531కు సమాచారం అందించాలన్నారు.

కుక్క దాడిలో బాలుడికి గాయాలు

బెజ్జూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అందుగులగూడ గ్రామంలో ఆదివారం ఆలం మనోజ్ ఇంటిముందు ఆడుతుండగా కుక్క దాడి చేసింది. దీంతో చెవికి తీవ్రగాయాలు అయ్యాయి. కుటుంబసభ్యులు గమనించి కుక్కను తరమడంతో ప్రమాదం తప్పింది. గాయపడ్డ బాలుడిని చికిత్స కోసం బెజ్జూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించగా అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కాగజ్‌నగర్ పట్టణానికి తరలించారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు


తనిఖీ చేపడుతున్న ఏసీపీ

శ్రీరాంపూర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. శ్రీరాంపూర్ కొత్తరోడ్డు ప్రాంతంలో కమ్యూనిటీ కార్యక్రమం, నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సహాయంతో తనిఖీలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రజల రక్షణ, భద్రత పోలీసులదేనన్నారు. గ్రామంలో కొత్త వ్యక్తులు, నేరస్తులు, షెల్టర్ తీసుకుంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. యవత చెడు అలవాట్లకు బానిసై జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలు, మోసగాళ్ల ఫోన్‌కాల్స్, మేస్సేజ్‌లు, వాట్సప్ కాల్స్‌కు స్పందించవద్దన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు కలిగి ఉండాలన్నారు. కాలనీల్లో సీసీ కెమెరాలు అమర్చుకోవాలన్నారు. సరైన వాహన పత్రాలు, నెంబర్ ప్లేట్లు లేని 40 ద్విచక్రవాహనాలు, 5 ఆటోలను సీజ్ చేశారు. సీఐ వేణుచందర్, ఎస్ఐలు సంతోష్, శ్రీధర్, లక్ష్మీ, ప్రసన్న, ఇతర పోలీసు సిబ్బంది, నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ టీం, ప్రజలు పాల్గొన్నారు.

కరపత్రాల విడుదల

జన్నారం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 26న చేపట్టే దేశ వ్యాప్త నిరసన కరపత్రాలను ఆదివారం మండల కేంద్రంలో రైతు సంఘం నాయకులు విడుదల చేశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండగుర్ల లింగన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు ప్రయోజనాలను కలిగిస్తూ ప్రజలు, కార్మికులను, రైతులకు ఇబ్బందులకు గురి చేస్తున్నాన్నారు. నిరసనలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. లక్ష్మణ్, బుచ్చయ్య, సువర్ణ, లక్ష్మీ పాల్గొన్నారు.

బీజేపీ బూత్‌స్థాయి సమావేశం

చెన్నూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం పట్టణాధ్యక్షుడు జాడి తిరుపతి ఆధ్వర్యంలో బూత్ స్థాయి ఎన్నికల ప్రక్రియ సమావేశం నిర్వహించారు. పట్టణంలోని 19 బూత్‌లకు, 4 శక్తి కేంద్రాలకు రిటర్నింగ్ అధికారులను నియమించారు. పట్టణ సంస్థాగత ఎన్నికల సంయోజక్ పిట్టల రవి, పట్టణ ఇన్‌చార్జీ పానుగంటి మధులు మాట్లాడుతూ బూత్‌లో వంద సభ్యత్వాలు పూర్తి చేసి క్రియాశీల సభ్యత్వం గల వారికి బూత్ ఎన్నికల ఫారం ఇచ్చామన్నారు. సమ్మయ్య, వెంకటనర్సయ్య, శ్రీపాల్, శ్రావణి, రాజేశ్వర్, చిరంజీవి, దుర్గ ప్రసాద్, శ్రీకాంత్, మౌనిక, శంకర్, మహేష్, సుదర్శన్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు


కన్నెపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలో బీజేపీ గెలిచిన సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు కొయ్యల ఏమాజీ, మండల అధ్యక్షుడు బేర రామన్నయాదవ్, మాజీ సర్పంచు పుల్లూరి రాజయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

హాజీపూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల మాధవ సేవా సమితి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రాంపూర్ ఆవాస విద్యాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులు, గ్రామస్థులు 367 మందికి వైద్య పరీక్షలు చేసి మందు పంపిణీ చేశారు. వైద్యులు బద్రి నారాయణ, చిందం అభిషేక్, సూర్యనారాయణ, నవీన్‌కుమార్, రాజేందర్, రవీందర్‌రెడ్డి, ప్రధానాచార్యులు రావుల రామన్న పాల్గొన్నారు.

కలల వేతనం.. కన్నవారికే

● డీఎస్సీలో టీచర్ ఉద్యోగం సాధించిన యువకులు



వాంకిడి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చదువుకోవాలనే పట్టుదల వారిలో ఉంది. దానికి వారి అమ్మానాన్నలు ప్రోత్సాహాన్ని అందించారు. వారి ఆశలను నిజం చేస్తూ తాజా డీఎస్సీ ఫలితాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించి తమ పట్టుదలను నిరూపించుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా తమ తొలివేతనాన్ని అమ్మానాన్నకు ఇచ్చి వారి కళ్లల్లో ఆనందాన్ని చూడాలని వారు భావిస్తున్నారు. ఈమేరకు ప్రభుత్వపాఠశాలల్లో ఉపాధ్యాయులుగా విధుల్లో చేరిన వాంకిడి మండలానికి చెందిన వారు తమ మనోభావాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

నాన్నకు బహుమతి..



నా తొలివేతనాన్ని నాన్నకు బహుమతిగా ఇవ్వాలనుకుంటున్నాను. ఆయన ప్రోత్సాహంతోనే ప్రభుత్వ ఉద్యోగానికి సన్నద్ధం అయ్యాను. గత ఏడాది రైల్వేశాఖలో ఉద్యోగం సాధించాను. ఉపాధ్యాయుడిగా ఉద్యోగం చేయాలనే తపనతో డీఎస్సీకి సన్నద్ధం అయ్యాను. తాజాగా డీఎస్సీలో ఉద్యోగం సాధించడంతో నాన్న కళ్లల్లో సంతోషం చూశాను. నాన్న ప్రోత్సాహం, ఆశీస్సుల వల్లే నాకు ఉద్యోగం లభించిందనుకుంటున్నాను.

- వడ్లూరి స్నేహల్ వంశీ, స్కూల్ అసిస్టెంట్, రన్‌వెల్లి, కాగజ్‌నగర్

కొత్త బట్టలు కొనిపెడతా..



నా తొలివేతనంతో అమ్మా, నాన్నలకు కొత్త బట్టలు కొనిపెట్టాలని అనుకుంటున్నాను. మాది నిరుపేద కుటుంబం. నాన్న ట్రాలీఆటో నడుపుతూ అమ్మ వ్యవసాయ కూలీపని చేసి నన్ను చదివించింది. నా చదువు కోసం వారు ఎంతో కష్టపడ్డారు. అమ్మానాన్నల కల నేరవేర్చాలని, ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని పట్టుదలతో చదువుకున్నాను. తాజాగా డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించి వారి కల నేరవేర్చాను.

- సీహెచ్ భరత్, ఎస్జీటీ, అంకుసాపూర్, కాగజ్‌నగర్

అమ్మా, నాన్నకు ఇస్తా..



తొలివేతనాన్ని మా అమ్మా నాన్నకు ఇవ్వాలనుకుంటున్నాను. వారు నా చదువుకోసం నా చదువు కోసం ఎంతో కష్టపడ్డారు. అమ్మానాన్నల కష్టాలు ఎలాగైన తొలగించాలనే పట్టుదలతో ఆన్‌లైన్ తరగతులతో డీఎస్సీకి సన్నద్ధం అయ్యాను. తాజాగా డీఎస్సీలో ఉద్యోగాం సాధించి వారి కలను సాకారం చేశాను. తొలి సంపాదనను వారికిస్తే వారు తృప్తి చెందుతారని భావిస్తున్నాను.

- కే అక్షయ్, ఎస్జీటీ, కొమ్ముగూడ, ఆసిఫాబాద్

నేటి నుంచి ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీలు

వాంకిడి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధిహామీ పనులపై సోమవారం నుంచి సామాజిక తనిఖీ బృందాలు తనిఖీ చేపడుతాయని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. డిసెంబరు3న డీఆర్డీవో సమక్షంలో ప్రజావేదిక ఏర్పాటు చేసి తనిఖీ వివరాలు వెల్లడిస్తామన్నారు.

లారీ అసోసియేషన్ అధ్యక్షుడిగా యూసుఫ్‌ఖాన్


అధ్యక్షుడు యూసుఫ్ ఖాన్

కాగజ్‌నగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ లారీ అసోసియేషన్ అధ్యక్ష ఎన్నికలు ఆదివారం జరిగాయి. గతంలో పనిచేసిన లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్‌బాబు రాజీనామా చేయటంతో ఈ ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షపదవికి యూసుఫ్‌ఖాన్, శంకర్ పోటీ పడ్డారు. మొత్తం 133ఓట్లువేయగా ఇందులో యూసు ఫ్‌ఖాన్‌కు 81, శంకర్‌కు 52 ఓట్లు వచ్చాయి. దీంతో ఈ ఎన్నికల్లో యూసుఫ్‌ఖాన్ గెలిచినట్టు ఎన్నికల అధికారి సలీం ప్రకటించారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

రెబ్బెన, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందిరానగర్ దుర్గాదేవి ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఒడిబియ్యం, నైవేద్యాలను సమర్పించారు. ఆలయ పూజారి దేవర వినోద్ భక్తులు ప్రసాదాలు అందజేసి అన్నప్రసాద వితరణ చేపట్టారు.

ఆదమరిస్తే అంతే!


కల్వర్టుపై ఏర్పడ్డ గుంత

కెరమెరి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోయగాం నుంచి రాంజీగూడ, సావర్‌ఖేడ గ్రామాలకు వెళ్లే దారిలో కల్వర్టుపై పెద్దగుంత ఏర్పడి ఏళ్లుగడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. రాంజీగూడ గ్రామస్థులు, విద్యార్థులు ప్రతినిత్యం ఈ దారిగుండా రాక పోకలు చేస్తుంటారు. ఆదమరిచి వెళితే ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

సత్యసాయిబాబా జయంతి వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న కోనప్ప దంపతులు

సిర్పూర్(టి), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని షేక్మాద్‌గూడలో శనివారం రాత్రి సత్యసాయి బాబా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఆయన సతీమణి రమాదేవి పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహిం చారు. అనంతరం విద్యార్థులకు ప్యాడ్‌లు, తదితరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డుసభ్యుడు మోహన్, కీజర్ హుస్సేన్, మహేష్, వామన్, తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు)లో 9.4డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు


సిర్పూర్(యు)లో చలి మంట కాగుతున్న మహిళలు, చిన్నారులు

ఆసిఫాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏజెన్సీ మండలాలు చలి తీవ్రతకు గజగజ వణుకుతున్నాయి. ఆదివారం రాష్ట్రంలోనే సిర్పూర్(యు) మండలంలో 9.4డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు అయింది. కెరమెరిలో 11.9డిగ్రీలు, వాంకిడిలో 12.0 డిగ్రీలు, తిర్యాణిలో 12.5డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో ఏజెన్సీ మండలాల్లోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చలినుంచి ఉపశమనం పొందేందుకు నెగళ్లు, చలి మంటలు కాగుతున్నారు.

మంచిర్యాల జిల్లాలో ఆదివారం 12.4 డిగ్రీలకనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జన్నారం మండల కేంద్రంలో 12.6డిగ్రీలు, జన్నారం మండలం తపాల్‌పూర్‌లో 12.9డిగ్రీలు, కన్నెపల్లి మండలంలోని 14.2డిగ్రీలు, కాసిపేట మండలం కొండాపూర్‌లో 14.4డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఆవుల మందపై పులి దాడి


పులి దాడిలో గాయపడ్డ ఆవు

వాంకిడి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని దాబా, బండకాస గ్రామంలో కోర్ డోబ్రాలొద్ది ప్రాంతంలో ఆదివారం ఆవుల మందపై పులిదాడి చేసింది. ఈ దాడిలో ఒకఆవు మృతిచెందగా మరో రెండుఆవులకు తీవ్ర గాయాలు అయ్యాయి. బండకాస గ్రామానికి చెందిన పశువుల కాపరి సోయం బాబురావు ఆదివారం మధ్యాహ్నం గ్రామసమీపంలో పశువులను మేతకు తీసుకువెళ్లాడు. మధ్యాహ్నం పులి పశువుల మందపై దాడిచేసింది. పశువుల కాపరి పులిని చూసి భయందోళనకు గురై గ్రామస్థులకు సమాచారం అందించారు. గ్రామస్థులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అనంతరం వారు వచ్చి ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. పులి పశువుల మందైప దాడి చేయడంతో సమీపప్రాంతాల గిరిజన రైతులు భయాందోళకు గురవుతున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయింది

● బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి అంజనేయులు గౌడ్


మాట్లాడుతున్న అంజనేయులు గౌడ్

రెబ్బెన, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయిందని బీజేపీ జిల్లాఅధికార ప్రతినిధి కేసరి అంజనేయులుగౌడ్ అన్నారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో ఆరు గ్యారంటీల స్కీంతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసినట్టు తెలిపారు. అన్ని విధాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలో ప్రజా తిరుగుబాటు తథ్యమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చినహామీలు ఇంతవరకు నేరవేర్చలేదన్నారు. రాష్ట్రంలో చేపట్టిన కులగణన పెద్దబోగస్ అన్నారు. అందుకే ఈ సర్వేకు ప్రజలు సహకరించటం లేదన్నారు. సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, జిల్లానాయకులు బోనగిరి సతీష్‌బాబు, అన్నపూర్ణ సుదర్శన్‌గౌడ్, మండల ప్రధానకార్యదర్శి నవీన్‌గౌడ్, ప్రసాద్, వసంత్‌రావు, అఖిల్, లక్ష్మణ్, రాజేష్ పాల్గొన్నారు.

రామగుండం ఎన్టీపీసీకి అవార్డుల పంట

● ఆర్ఈడీకి లీడర్ సీఈవో, హెచ్ఆర్‌కు మరో నాలుగు అవార్డులు

జ్యోతినగర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిజిల్లా రామగుండం ఎన్టీపీసీకి మరోసారి జాతీయస్థాయి అవార్డుల పంట పండింది. గోవాలో శనివారం రాత్రి జరిగిన అపెక్స్ ఇండియా ఫౌండేషన్ అవార్డుల కార్యక్రమంలో రామగుండం ప్రాజెక్టు అధికారులకు పురస్కారాలను అందజేశారు. ఎన్టీపీసీ ఆర్ఈడీ కేదార్ రంజన్ పాండుకు లీడర్ సీఈవో ఆఫ్ ద ఇయర్ 2024 అవార్డు, టెక్నాలజీ ఎక్స్‌లెన్స్ కేటగిరిలో ప్లాటినం అపెక్స్ అవార్డు, హెచ్ఆర్ ఎక్స్‌లెన్స్‌లో గోల్డ్ అవార్డు, ట్రైనింగ్ ఎక్స్‌లెన్స్ గోల్డ్ అవార్డు, సేఫ్టీ అండ్ ఆక్యుపేషనల్ హెల్త్‌లో గోల్డ్ అవార్డు లభించాయి. ఎన్టీపీసీ ఆర్ఈడీ కేదార్ రంజన్, ఏజీఎం(హెచ్ఆర్) విజయ్ కుమార్ సిక్దర్, అధికారి ప్రజ్ఞ అవార్డులను అందుకున్నారు.

నాణ్యతలేని పనులు.. నిధులు మట్టిపాలు

● చిత్తడిగా మారిన కర్జల్లి- గూడెం రోడ్డు ● బురదలో కూరుకుపోతున్న వాహనాలు


బురదమయంగా మారిన కర్జవెల్లి- గూడెం రోడ్డు

చింతలమానేపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతిఏటా నియోజకవర్గాల అభివృద్ధికోసం నిధులు మంజూరు అవుతుండగా ఆ నిధులను మండల స్థాయి నాయకులే గుత్తేదారులుగా అవతారమెత్తి తూతూ మంత్రంగా పనులు చేస్తుండడంతో పనుల్లో నాణ్యత లేకుండా పోతోంది. ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు సైతం పర్యవేక్షణ చేయడం లేదు. మండలంలోని కర్జవెల్లి నుంచి గూడెం వరకు బీటీ రోడ్డు ఉండగా అది అంతరాష్ట్ర వారధిగా మారింది. ఈ రోడ్డు గుండా నిత్యం అధికలోడు కలిగిన వాహనాలు వెళ్తుండడంతోరోడ్డు పూర్తి గుంతలమయమైంది. అయితే రోడ్డుకు మరమ్మతులు చేపట్టేందుకు ప్రజాప్రతినిధుల ద్వారా రూ.20 లక్షలు వెచ్చించి గుంతలను రోడ్డుపై మట్టినిపోసి చదును చేయించారు. అయితే అది పూర్తిగా బురదమయంగా మారి వచ్చిపోయే వావాహనదారులకు తీవ్రఇబ్బందులు కలిగిస్తోంది. గూడెం గ్రామానికి చెందిన ఓవ్యక్తి వాహనం ఇదేరోడ్డుపై బురదలో దిగబడితే మరో వాహనంతో బయటికి తీయాల్సిన పరిస్థితి నెలకొంది. గుంతలు పడ్డ రోడ్డుపై మరమ్మతులు చేపడుతారంటే పూర్తి అధ్వానంగా మార్చారని వాహనదారులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. నిదుల్ని బురదపాలు చేశారని ప్రయాణికులు, మండలవాసులు వాపోతున్నారు. గుత్తేదారు పనితీరు మండలంలో పలు విమర్శలకు తావిస్తోంది. పంచాయతీరాజ్ అధికారులు వెంటనే స్పందించి రోడ్డు సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలని మండలప్రజలు కోరుతున్నారు.

రోడ్డు పనులు నాణ్యతగా చేయలేదు..

- గంగిరెడ్డి తిరుపతిరెడ్డి, గూడెం



కర్జవెల్లినుంచి గూడెంవరకుఉన్న బీటీ రోడ్డుపై మట్టిని పోశారు. అది ఏమాత్రం నాణ్యతగా లేకపోవడంతోనే రోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. దీంతో వచ్చిపోయే వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. వాహనాలు బురదలో కూరుకు పోతున్నాయి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించేలా చూడాలి.



సింగరేణిలో ప్రజాపాలన వేడుకలు

మందమర్రిటౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో ప్రజాపాలన విజయోత్సవాలను నిర్వహించేందుకు ఐఎన్‌టీయూసీ యూనియన్ ప్రణాళికలు సిద్ధం చేసింది. యూనియన్ సెక్రెటరీ జనరల్, రాష్ట్ర కనీసవేతనాల సలహాచైర్మన్ జనక్‌ప్రసాద్ సింగరేణిలోని 11 ఏరియాల నాయకులు, కార్యకర్తలతో మరోరెండు రోజుల్లో సమావేశం నిర్వహించనున్నారు. ఏరియాల వారీగా గనులవద్ద సంబరాలు నిర్వహించడానికి ఆయన దిశ నిర్దేశం చేయనున్నారు. డిసెంబరు 1నుంచి 9వరకు మూడు లేదా ఐదురోజులవరకు తేదీల ఖరారు కోసం చర్చించనున్నట్లు తెలుస్తోంది. మంత్రి శ్రీధర్‌బాబు, కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలను ఆహ్వానించడానికి చూస్తున్నట్లు తెలుస్తోంది. అట్టహాసంగా వేడుకలు నిర్వహించడానికి చూస్తున్నట్లు, మందమర్రిలో ఒక సభ కూడా ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా జనక్‌ప్రసాద్ మాట్లాడుతూ డిసెంబరు1 నుంచి9వరకు మూడు లేదా ఐదు రోజుల పాటు సింగరేణిలో ప్రజాపాలన విజయోత్సవ వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. తమ ప్రభుత్వం కార్మికుల కోసం చేపట్టిన సంక్షేమాన్ని వివరిస్తామని ఆయన తెలిపారు.

ఎస్టీపీపీలో మిథనాల్ ప్లాంట్ ఏర్పాటు

5వపేజీ తరువాయి..



ప్లాంట్‌లో మిథనాల్ తయారు చేసే యూనిట్లు

నిర్వహణ బాధ్యతలు జేఎన్‌సీఏఎస్‌ఆర్‌కు....

కోల్ ఇండియా అనుబంధ రీసెర్చ్ యూనిట్ అయిన సీఎంపీడీఐఎల్ ఆర్థిక సహకారంతో సింగరేణి యాజమాన్యం ప్లాంట్ నిర్మాణాన్ని చేపడుతోంది. ప్లాంట్ నిర్వహణ, మిథనాల్ ఉత్పత్తి, తదితర బాధ్యతలను బెంగుళూరుకు చెందిన జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సైంటిఫిక్ రీసెర్చ్ అండ్ బ్రెత్ అప్లైడ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించారు. ప్లాంట్ నిర్మాణానికి సుమారు రూ.20 కోట్ల ఖర్చవుతుందని అంచనా.

వ్యాపార ప్రయోజనాల కోసం....

ప్రయోగాత్మక ప్లాంటు ప్రారంభమైన అనంతరం రోజుకు 180 కేజీల మిథనాల్ తయారు కానుంది. ప్రయోగం విజయవంతమైతే మిథనాల్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి సింగరేణి సంసిద్ధంగా ఉంది. మిథనాల్‌ను ఎరువుల తయారీలో, అక్రిలిక్ ప్లాస్టిక్, సింథటిక్ ఫైబర్ వస్త్రాల తయారీలో, ప్లైవుడ్, పెయింట్స్ తయారీలో విస్తృతంగా వినియోగిస్తారు. ప్లాంట్‌లో తయారు చేసే మిథనాల్‌ను వివిధ పరిశ్రమలకు విక్రయించడం ద్వారా సింగరేణి యాజమాన్యం వ్యాపార విస్తరణకు ప్రణాళికలు చేస్తోంది. ప్రస్తుతం దేశీయ అవసరాలకోసం వినియోగిస్తున్న 120 మిలియన్ టన్నుల మిథనాల్‌లో దాదాపు 80 మిలియన్ టన్నులను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. దేశీయంగా ఉత్పత్తి దిశగా సింగరేణి చేపట్టే ఈ ప్రయోగాత్మక ప్రాజెక్టు విజయవంతం అయితే దేశంలోనే తొలి ప్రయోగాత్మక ప్లాంట్‌గా జైపూర్ ఎస్టీపీపీ చరిత్ర పుటల్లోకి ఎక్కనుంది. భవిష్యత్‌లో సంస్థ ఏర్పాటు చేసే ఇథనాల్ ప్లాంట్ల ద్వారా దేశానికి ఆర్థికంగా లబ్ధి చేకూర్చే అవకాశాలు మెండుగా ఉండనున్నాయి.

ఘనంగా అనఘాష్టమి వ్రతం



అనఘాష్టమి వ్రతంలో పాల్గొన్న మహిళలు

గర్మిళ్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల కాలేజీ రోడ్డు గోదావరి తీరాన గల గౌతమేశ్వర ఆలయంలో ఆదివారం అనఘాష్టమి వ్రతంను వేద పండితులు వేణుగోపాలశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. డిసెంబరు 23న వెయ్యి మంది భక్తులతో దత్త జయంతి సందర్భంగా అనగాష్టమి వ్రతం నిర్వహించనున్నట్లు వేద పండితులు తెలిపారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు.

ప్రైవేటు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా తిరుపతి

తాండూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రైవేటు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా తాండూర్ మండలానికి చెందిన పులుగం తిరుపతి ఎన్నికయ్యారు. ఆదివారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామ వెంకట్‌రెడ్డి తిరుపతికి నియామకం పత్రం అందించారు.



ఒగ్గు కథ చెబుతున్న కళాకారులు

ఒగ్గు కళకు ప్రాణం పోస్తున్న కోనంపేట కళాకారులు



యువకుల ఒగ్గుడోలు విన్యాసం

- పలు రాష్ట్రాల్లో ప్రదర్శనలు
- ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ప్రచారం
- ఆకట్టుకుంటున్న ఒగ్గుడోలు విన్యాసాలు

నెన్నెల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జానపద కళలు కనుమరుగవుతున్న ప్రస్తుత తరుణంలో కోనంపేట కళాకారులు ప్రాచీన ఒగ్గుకథకు ప్రాణం పోస్తున్నారు. జానపదాన్ని ప్రాణప్రదంగా భావిస్తూ తాతల కాలం నుంచి వస్తున్న కళా వారసత్వాన్ని కాపాడుకుంటున్నారు. పల్లెపదాలకు పట్టణాల్లో సైతం ఖ్యాతి ఆర్జించి పెడుతున్నారు. పలు రాష్ట్రాల్లో ప్రదర్శనలతో తెలంగాణ జానపద రూపాన్ని జాతీయ వేదికలపై కదం తొక్కిస్తున్నారు. ఒగ్గుకథ, ఒగ్గుడోలు విన్యాసాలకు పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేస్తున్నారు. తెలుగు కళారూపాన్ని... ప్రాచీన కళలోని భాషవారసత్వాన్ని ముందు తరాలకు అందిస్తూ మార్గదర్శకులుగా నిలుస్తున్నారు.

● ఒగ్గుకథ అంటే...

ఒగ్గుకథ ఓ జానపద కళారూపం. వాడుక బాషలోని ప్రతి పదాన్ని పాటగా మార్చే పల్లెపదం. గానం, నృత్యం, నాటికల మిశ్రమం. గొల్లకురుమలు తమ కులపురుషుడు బీరప్ప కథ చెప్పేందుకు ఎంచుకున్న కళారూపమే ఒగ్గుకథ. శైవ సంప్రదాయంలో ఒక వర్గం వారు శివుని ఢమరుకాన్ని ఒగ్గు అంటారు. ఒగ్గును వాయిద్యంగా వాడుతూ కథ చెబుతున్నందున ఒగ్గు కథ అనే పేరొచ్చింది. గొల్ల కురుమలు తమ కుల దేవతలు బీరప్ప, మలన్న కథలను ఒగ్గుకథ రూపంలో చెప్పుకుంటూ వస్తున్నారు. డోలు, తాళాల చప్పుళ్ల మధ్య అయిదుగురు కళాకారులు ప్రదర్శన ఇస్తారు. మల్లన్న దేవాలయాల్లో ఒగ్గు కళాకారుల మేల్కొలుపు పాటతోనే స్వామి వారి పూజలు ప్రారంభమవుతాయి. బోనాల సందర్భంగా ఒగ్గుపూజారులు పట్నం వేసి, మన్మయ పాత్రలో నివేదనం సమర్పిస్తారు.

● ఒగ్గుకు పెట్టని కోట... కోనంపేట

నెన్నెల మండల కోనంపేట ఒగ్గు కళకు పెట్టింది పేరు. గుంటి బీరయ్య ఇక్కడ వందేళ్ల కిందటే ఒగ్గు కథ చెప్పారు. ఆయన వారసత్వంగా గ్రామంలోని దాదాపు 40మంది యువకులు ఇప్పుడు కళాకారులయ్యారు. ఏనుగుల శంకర్, గుంటి శ్రీశైలం, గుంటి తిరుపతి బృందాలు ఒగ్గు ప్రదర్శనల్లో పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారు. ఒగ్గు కళాకారులు చెప్పే కథలకు పల్లెజనం మంత్రముగ్ధులవుతారు.

● సాధనతో ప్రావీణ్యం

నృత్యంతో పాటు రాగం కూడా ఒగ్గులో ప్రధానం. ఇందులో ప్రావీణ్యం సంపాదించేందుకు ఇక్కడి కళాకారులు తాపత్రయపడుతుంటారు. అకుంఠిత దీక్ష, పట్టుదలతో సాధన చేస్తున్నారు. తాతలకాలం నుంచి వస్తున్న కళకు మరింత పదును పెట్టేందుకు అంతర్జాతీయ కళాకారులు చుక్కా సత్తయ్య వద్ద శిక్షణ తీసుకున్నారు. కథకంటే దాన్ని చెప్పడానికి ఇక్కడి కళాకారులు అనుసరిస్తున్న విధానం బాగుంటుంది. కథకు అనుగుణంగా సూక్తులు, హితోక్తులు, నానుడులకు శ్రావ్యమైన రాగంతో కథలో భాగం కల్పిస్తారు.

● పలు రాష్ట్రాల్లో ప్రదర్శనలు

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఇక్కడి కళాకారులు వందల ప్రదర్శనలు ఇచ్చారు. పౌరసంబంధాలు, సమాచార శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రచారం కల్పించారు. పోలీసుల జనమైత్రి, ప్రాణహిత పుష్కరాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. హైదరాబాదు, ఆదిలాబాదు ఆకాశవాణి కేంద్రాల ద్వార ప్రసారమైన కథలు శ్రోతల మన్ననలు పొందాయి. హైదరాబాదులోని రవీంద్రభారతి, శిల్పకళారామంలో, తెలంగాణ భాష సంస్కృతికశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కళారాధనలో ఒగ్గు కళారూపాన్ని ప్రదర్శించారు. ఏనుగు శంకర్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేత సన్మానం పొందారు.



ఆంధ్రప్రదేశ్ సీఎం చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న ఏనుగు శంకర్

● అబ్బురపరిచే ఒగ్గుడోలు విన్యాసాలు

ఒగ్గుకథలు చెబుతూనే యువ కళాకారులు ఒగ్గుడోలు విన్యాసాలను నేర్చుకున్నారు. ఏకరూప దుస్తులు ధరించి వారు చేసే నృత్యాలు ఆకట్టుకుంటాయి. 12 నుంచి 20 మంది బృందంగా ఏర్పడి డిల్లంబల్లం అంటూ సందడి చేస్తారు. ఒగ్గుడోలు కళాకారులు పిరమిడ్‌గా చేసే సాహసోపేత ప్రదర్శనలు ఆకట్టుకుంటాయి. ప్రధాన కథకుడు వేప మండల చేతబట్టి తలపై బోనం పెట్టుకుని వివిధ భంగిమల్లో అభినయిస్తూ నేలపై ఉన్న నాణాన్ని నుదురుకు అంటించుకునే సన్నివేశం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఇటీవల కాలంలో పల్లెల్లో ఒగ్గుడోలు విన్యాసాలకు ఆదరణ పెరిగింది. సభలు, సమావేశాలు, నాయకుల స్వాగత కార్యక్రమాల్లో ఈ బృందాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

ప్రభుత్వం ప్రోత్సహించాలి



కోనంపేట ఒగ్గుకథ తాతల కాలం నుంచి మాకు వారసత్వంగా వస్తోంది. మా తాత గుంటి బీరయ్య ఒగ్గులో మాకు ఓనమాలు నేర్పారు. ఈ ప్రాచీన సంప్రదాయ కళ అంతరించి పోకుండా ఉండేందుకు కృషి చేస్తున్నాం. ప్రాచీన కళను జానపద కళలకు ఒకప్పుడు గుర్తింపు ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. నానాటికి ఆదరణ తగ్గడంతో కళాకారుల జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారుతోంది. కళను నమ్మి బతుకుతున్నాం. కళాకారు లకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వాలి. వయసు పైబడిన కళకారులకు పింఛను అందజేయాలి.

- ఏనుగుల శంకర్, ఒగ్గుబృందం నాయకుడు, కోనంపేట

న్యూస్ బాక్స్

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక



క్రీడాకారుడు శ్రీనాథ్‌తో కోచ్ రాజేష్

మంచిర్యాల అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారుడు శ్రీనాథ్ ఎంపికయ్యాడు. హైదరాబాద్ లాలాగూడలో రైల్వే మిక్స్‌డ్ హైస్కూల్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ బాక్సింగ్ పోటీల్లో అండర్ 14 (28 నుంచి 30 కేజీల) విభాగంలో శ్రీనాథ్ గోల్డ్‌మెడల్ సాధించి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ ఫణిరాజా, బాక్సింగ్ కోచ్ రాజేష్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనాథ్‌ను డీవైఎస్‌వో కీర్తి రాజ్‌వీర్ అభినందించారు.

అవార్డు అందుకున్న రవీందర్



మందమర్రిటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రాణహిత కాలనీకి చెందిన మట్టె రవీందర్ డాక్టర్ అబ్దుల్ కలాం ఆజాద్ లెజెండరీ అవార్డును అందుకున్నారు. ఆదివారం హైద్రాబాద్ రవీంద్రభారతిలో అభిలాష్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నటుడు నరేన్ తేజ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. రవీందర్ రాసిన మహోన్నత శిఖరం కవితకు పురస్కారం లభించింది. జ్యోతిస్వరూప్, వంశీకృష్ణ, డాక్టర్ సరోజనమ్మ ఉన్నారు.

తుడుందెబ్బ జిల్లాప్రధాన కార్యదర్శిగా కనకరాజు



కాసిపేట, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి): తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కాసిపేట మండలంలోని మద్దిమాడకు చెందిన కనకరాజు నియమితులయ్యారు. ఈ నెల 20న ఉట్నూరులో జరిగిన సమావేశంలో కనకరాజును రాష్ట్ర కన్వీనర్ బుర్స పోచయ్య నియమించి నియామక పత్రం అందించారు. తుడుందెబ్బ బలోపేతానికి కృషి చేస్తానని కనకరాజు తెలిపారు.

గూడెం గుట్టపై కార్తీక సందడి



ఎంపీని సన్మానిస్తున్న ఈవో

దండేపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఆదివారం పురస్కరించుకుని గూడెం సత్యనారాయణ స్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. సెలవు దినం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ సమీప గోదావరి నదిలో కార్తీక స్నానాలు ఆచరించి గంగమ్మ తల్లికి దీపాలు వెలిగించారు. అనంతరం 600 మందిపైగా భక్తులు కుటుంబ సమేతంగా సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు. మహిళలు ప్రధానాలయం వద్ద, కింద రావి చెట్టు వద్ద కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు.

సత్యదేవున్ని దర్శించుకున్న ఎంపీ

గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో ఎంపీ గడ్డం వంశీకృష్ణ సత్యదేవున్ని దర్శించుకొన్నారు. ముందుగా ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభం, మంగళ వాయిద్యాలతో ఎంపీకి ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ముఖ్య అర్చకులు గోవర్దన రఘస్వామి, వేద పండితులు దుద్దిళ్ళ నారాయణశర్మ, భరత్‌శర్మ, అర్చకులు సత్యనారాయణస్వామిలు స్వాగతం పలికారు. సత్యదేవున్ని దర్శించుకొన్నారు. అనంతరం ఎంపీ వంశీకృష్ణను సత్కరించి ఆశీర్వచనం, తీర్థప్రసాలను అందజేశారు.

పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి

శ్రీరాంపూర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉమ్మడి కరీంనగర్- ఆదిలాబాద్- నిజామాబాద్- మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోకల నాగయ్య వర్మ అన్నారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. తెలంగాణ లెక్చరర్ల ఫోరం రాష్ట్ర కన్వీనర్‌గా 12 ఏళ్లుగా ప్రైవేటు లెక్చరర్లు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని తెలిపారు. సామాన్యుడినైన తనను ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఆవుల రాజేశ్ యాదవ్, రాపెల్లి రాజన్న యాదవ్, పావని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు ఎన్‌సీసీ దోహదం

మంచిర్యాల అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ఎన్‌సీసీ దోహదపడుతుందని ఆర్డీవో శ్రీనివాస్‌రావు అన్నారు. ఆదివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్‌సీసీ దినోత్సవంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ క్రమశిక్షణకు మారుపేరని, తాను ఎన్‌సీసీ కెడెట్‌గా ఉన్నానన్నారు. ఎన్‌సీసీతో సేవాభావం పెరుగుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇదే కళాశాలలో డిగ్రీ విద్యను అభ్యసించి ఇక్కడే ఎన్‌సీసీ బెటాలియన్ నెంబర్-32 స్టూడెంట్ అయిన ఆర్డీవో తిరిగి 32 యేండ్ల తర్వాత ఉన్నతస్థాయి అధికారి హోదాలో ఎన్‌సీసీ డే కార్యక్రమానికి హాజరు కావడం అభినందనీయమన్నారు. కళాశాలలో ఎన్‌సీసీ, టాస్క్ ప్రోగ్రామ్స్ ద్వారా ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. అనంతరం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు రక్తదానం చేశారు. ఎంఈవో మల్లేష్, ఎన్‌సీసీ కేర్‌టేకర్ జాడి మహేష్‌కుమార్, లెఫ్టినెంట్ బి.తిరుపతి, అధ్యాపకులు గంగయ్య, కుమార్, గోపాలకృష్ణ, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

సీవీ రామన్ కాలేజీలో ఎన్‌సీసీ డే...

జిల్లా కేంద్రంలోని సీవీ రామన్ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ డేను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ నర్సయ్య ఎన్‌సీసీ జెండా ఊపి ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్‌సీసీతో క్రమశిక్షణతోపాటు నాయకత్వ లక్షణాలు అలవడుతాయన్నారు. బీ, సీ సర్టిఫికెట్లతో 5 శాతం రిజర్వేషన్‌తో ఉద్యోగాలు పొందవచ్చన్నారు. అనంతరం ఎన్‌సీసీ కెడెట్లు రక్తదానం చేశారు. ఏవో రమేష్‌కుమార్, ఎన్‌సీసీ అధికారి ప్రశాంత్, ట్రినిటీ ఎన్‌సీసీ అధికారి వి.రాజానందం, ఆనంద్‌రావు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న బండి సదానందం యాదవ్

మందమర్రిటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అభయాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి ఆలయ కమిటీ సభ్యులు కృషి చేయాలని ఆలయ చైర్మన్ బండి సదానందంయాదవ్ తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మారుతినగర్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. భక్తులకు తాగునీరు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఆంజనేయ స్వామి భక్తుల కోసం గదులు ఏర్పాటు చేయడానికి దృష్టి సారించామన్నారు. అనంతరం సదానందం యాదవ్‌ను సన్మానించారు. ఆలయ గౌరవాధ్యక్షుడు మూల రవీందర్‌రెడ్డి, బండారి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు రాగిడి రాంరెడ్డి, కుంట తిరుపతి, ప్రధాన కార్యదర్శి మంచికట్ల రమేష్, జాయింట్ సెక్రటరీ సిరిపురం లక్ష్మణ్, కోశాధికారి పెద్ది రాజన్న, లీగల్ అడ్వైజర్ మేకల రాజన్న, ప్రచార కార్యదర్శులు మేకల శంకర్, సభ్యులు పాల్గొన్నారు.

అథెటిక్స్ పోటీల్లో ప్రతిభ



మెడల్స్‌తో విద్యార్థులు

చెన్నూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పట్టణంలోని శార్వాణీ పాఠశాల ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. మొత్తం 21 మంది విద్యార్థులు గెలుపొందారు. ఏడుగురు బంగారు పతకాలు, 8 మంది వెండి పతకాలు, ఆరుగురు బ్రాంజ్ పతకాలను సాధించారు. విద్యార్థులను కరస్పాండెంట్ శ్రావణ్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీజన్, స్వామి, ఉపాధ్యాయులు రాములు అభినందించారు.

అటవీ సంరక్షణపై విద్యార్థులకు అవగాహన

హాజీపూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జన్నారం మండలంలోని కిష్టాపూర్ పాఠశాల విద్యార్థులు వనదర్శినిలో భాగంగా పాత మంచిర్యాల అటవీ సెక్షన్ పరిధిలోని సఫారీ ట్రాక్, క్వారీ ప్రదేశాన్ని సందర్శించారు. అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ పర్యాటక అభివృద్ధిలో భాగంగా పాత మంచిర్యాల సెక్షన్ పరిధిలో 20 కిలోమీటర్ల ట్రెక్కింగ్, సఫారీని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం విద్యార్థులకు అటవీ సంరక్షణ, వన్య ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఎఫ్ఎస్‌వో అతహుల్లా, ఎఫ్‌బీవోలు రాజేందర్, సంతోష్, ప్రధానోపాధ్యాయుడు గుండ రాజన్న, ఉపాధ్యాయులు గోవర్ధన్, రాజన్న, లింగయ్య, ప్రకాష్, మణి, శ్రీనివాస్, రజితరాణి, సుష్మిత, 42 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



అటవీ ప్రాంతంలో విద్యార్థులు, అటవీ అధికారులు

క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆడాలి

బెల్లంపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులందరు క్రీడాస్ఫూర్తితో ఆడాలని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. ఆదివారం ఆకెనపల్లి గ్రామంలో తోకల ప్రదీప్ స్మారకార్థం వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. నాయకులు సత్యనారాయణ, లక్ష్మణ్, గణేష్‌గౌడ్, సుభాష్‌రావు, రాజశేఖర్, వెంకటేష్, కాంపెల్లి విశాల్ పాల్గొన్నారు.

ఉద్యోగాలు సాధించిన యువకులకు సన్మానం



యువకులను సన్మానిస్తున్న మాజీ సర్పంచు, మాజీ ఉపసర్పంచు


జన్నారం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతం హాస్టల్ తండా గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించగా వారిని ఆదివారం మాజీ సర్పంచు సంతోష్ సన్మానించారు. లకావత్ శ్రీనివాస్ సింగరేణిలో, తేజావత్ సోని కానిస్టేబుల్‌గా, లకావత్ రాజు రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగాలు సాధించారు. ఎంసెట్‌లో ర్యాంకులు సాధించిన హాస్టల్ తండాకు చెందిన విజేష్, శ్రీకాంత్, మహేష్‌లను సన్మానించారు. మాజీ ఉపసర్పంచు రాథోడ్ బాలాజీ, శ్రీనివాస్, అంబాజీ, ధర్మేష్, అమర్‌సింగ్, గబ్బర్‌సింగ్, అరవింద్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

తాండూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ పాఠశాలలో 1997-98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం సురభి గోదా క్షేత్రంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. మరణించిన ఉపాధ్యాయులు, విద్యార్థులకు సంతాపం ప్రకటించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుని సంతోషంగా గడిపారు. గురువులను ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు రాంమోహన్, జగన్నాథ్, సురేందర్, రవి, శంకర్, శుబాంగి, ప్రోగ్రాం ఆర్గనైజర్ సంతోష్, 150 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



న్యూస్ బాక్స్

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

మంచిర్యాల అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం జరిగిన నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య తెలిపారు. నాలుగు పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరుగగా 1042 మంది విద్యార్థులకు 999 మంది హాజరయ్యారని తెలిపారు. 43 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని, 95.8 హాజరు శాతం నమోదైందని డీఈవో తెలిపారు.

యోగా శిక్షకుల నియామకం

మందమర్రిరూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు ఉచిత యోగా నేర్పించడానికి యోగా శిక్షకులను నియమించింది. జిల్లా వ్యాప్తంగా పది సెంటర్లను ఏర్పాటు చేసింది. ఒక్కో సెంటర్‌కు ఒక మహిళ ట్రైనర్, ఒక పురుష ట్రైనర్‌లను నియమించారు. వీరంతా ప్రజలకు ఉదయం, సాయంత్రం యోగా నేర్పించనున్నారు. శిక్షకులలో మందమర్రికి శైలజ, రామ్మోహన్, దేవాపూర్‌కు గీతాదేవి, నస్పూర్‌కు మేఘన, సుధాకర్ తదితరులను నియమించారు. ఈ సందర్భంగా మందమర్రికి ఎంపికైన యోగా ట్రైనర్ శైలజ మాట్లాడుతూ యోగా క్లాసులను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు.

ఎస్టీపీపీలో మిథనాల్ ప్లాంట్ ఏర్పాటు

- ప్రయోగాత్మకంగా ప్లాంట్ నిర్మాణం
- కార్బన్ డయాక్సైడ్ ఆధారంగా మిథనాల్ తయారీ
- ప్రారంభమైన ప్లాంట్ నిర్మాణ పనులు
- వచ్చే నెలలో ప్రయోగానికి యాజమాన్యం సన్నాహాలు



జైపూర్ ఎస్టీపీపీ ఆవరణలో నిర్మిస్తున్న ప్రయోగాత్మక మిథనాల్ ప్లాంట్

మంచిర్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ మరో మైలురాయిని తన ఖాతాలో వేసుకునేందుకు రంగం సిద్ధమైంది. కార్బన్ డయాక్సైడ్ నుంచి మిథనాల్ తయారు చేసే ప్లాంట్‌కు సన్నాహాలు చేస్తోంది. జైపూర్ మండలం పెగడపల్లిలో గల సింగరేణి థర్మల్‌పవర్ ప్లాంట్ (ఎస్టీపీపీ) ఆవరణలో మిథనాల్ ద్రవం తయారు చేసేందుకు ప్లాంట్ నిర్మాణ పనులను ప్రారంభించింది. కోల్ ఇండియాతోపాటు ఇతర ప్రైవేటు సంస్థల భాగ స్వామ్యంతో ప్లాంట్ ఏర్పాటు చేస్తుండగా డిసెంబరు నెలాఖరులో ప్రయోగాత్మకంగా మిథనాల్ తయారీకి అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది. యాజమాన్యం అనుకున్నట్లు ప్రయోగం విజయవంతమైతే సింగరేణి ఆధ్వర్యంలో జైపూర్‌లో భారీ మిథనాల్ యూనిట్‌ను స్థాపించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు సంస్థ కసరత్తు చేస్తోంది.

కార్బన్ డయాక్సైడ్ ఆధారంగా...

సింగరేణిలో ఉత్పత్తి అయ్యే బొగ్గును మండించడం ద్వారా వెలువడే కార్బన్ డయాక్సైడ్ వాయువు ఆధారంగా మిథనాల్‌ను తయారు చేసేందుకు యాజమాన్యం అవసరమైన చర్యలు చేపడుతోంది. బొగ్గును మండించే సమయంలో కర్బన ఉద్గారాలు వాతావరణంలో కలవకుండా నివారించేందుకు ఎలక్ట్రోస్టాటిక్ ప్రెసిపిటేటర్స్ (ఈఎస్‌పీ)ను నెలకొల్పారు. తద్వారా వాతావరణం కలుషితమయ్యే అవకాశాలను నివారించనున్నారు. సంస్థలో ఉత్పత్తి అయ్యే కార్బన్‌డయాక్సైడ్‌ను మిథనాల్ ద్రావణం తయారీకి ఉపయోగిస్తారు. ఇందుకోసం ఎస్టీపీపీ చిమ్నీకి అనుబంధంగా ప్లాంట్‌నిర్మాణం చేపడుతున్నారు. ఈ విధానం ద్వారా ఉత్పత్తిఅయ్యే కార్బన్‌డయాక్సైడ్ 500 నుంచి 180 కేజీల మిథనాల్ తయారు చేసేందుకు సంస్థ ఏర్పాట్లు చేస్తోంది. ప్లాంటు నిర్మాణం పూర్తికాగానే అందులో కార్బన్‌డయాక్సైడ్‌ను సంగ్రహించే యూనిట్‌తోపాటు హైడ్రోజన్ జనరేషన్, కంప్రెషన్, మిథనాల్ డిస్టిలేషన్ యూనిట్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు అవసరమైన యంత్ర విభాగాల్లో కొన్నిప్లాంట్‌కు చేరుకోగా మిగతావి నెలాఖరుకు చేరతాయని అధికారులు చెబుతున్నారు.

మిగతా 7లో

కలల వేతనం.. కన్నవారికే

- డీఎస్సీలో టీచర్ ఉద్యోగం సాధించిన యువకులు

6



ఒగ్గు కళకు ప్రాణం పోస్తున్న కోనంపేట కళకారులు

- పలు రాష్ట్రాల్లో ప్రదర్శనలు
- ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ప్రచారం
- ఆకట్టుకుంటున్న ఒగ్గుడోలు విన్యాసాలు

7



పోలీసుల జనమైత్రి సభలో ఒగ్గుడోలు ప్రదర్శన

ఇంటర్నేషనల్ స్థాయిలో స్టేడియం ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న శివసేనారెడ్డి, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ

మంచిర్యాల అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సాయికుంటలో నిర్మించే ఇండోర్ స్టేడియంను ఇంటర్నేషనల్ స్థాయిలో నిర్మిస్తామని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్టేడియంలో రూ.9.50కోట్లతో 400 మీటర్ల సింథటిక్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూ.14కోట్లతో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, రూ.6కోట్లతో స్విమ్మింగ్ పూల్ నిర్మిస్తామన్నారు. ఖేల్ ఇండియా, స్టేట్ బడ్జెట్‌లో ఈ ప్రతిపాదనలు పెట్టి మూడు నెలల్లోనే డీపీఆర్‌ను సిద్ధం చేసి పనులను ప్రారంభిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో క్రీడారంగం నిర్వీర్యమైందన్నారు. మూడు నెలల్లో స్పోర్ట్స్ పాలసీని తీసుకువస్తామని, దాని ద్వారా క్రీడల్లో రాణించిన వారికి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. స్పోర్ట్స్ స్కూల్స్ సంఖ్యను పెంచి రాష్ట్రం నుంచి ఒలింపిక్స్ స్థాయి క్రీడాకారులను తయారు చేసే విధంగా ప్రభుత్వం ప్రణాళికలు చేస్తోందన్నారు. డిసెంబర్ 7న సీఎం కప్‌ను నిర్వహిస్తున్నామన్నారు. వచ్చే యేడాది సీఎం కప్ పోటీలను మంచిర్యాల స్టేడియంలోనే జరుపుతామన్నారు.

ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు సాయికుంటలో గల 11 ఎకరాల స్థలాన్ని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, కలెక్టర్ కుమార్‌దీపక్ పరిశీలించారు. సాట్స్ అధికారులు చంద్రారెడ్డి, రవికుమార్, నాయకులు ఉన్నారు.

ఆక్వా కల్చర్ ప్రాజెక్ట్

ఎల్లంపల్లి ప్రాజెక్ట్ సమీపంలో 30 ఎకరాల్లో కేంద్ర, రాష్ట్ర బడ్జెట్ రూ.60 కోట్లతో కొర్రమొట్టల సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నారు. రూ.55 కోట్లతో ఆక్వా కల్చర్ ప్రాజెక్ట్‌ను 50 ఎకరాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. కొర్రమొట్టలకు విదేశాల్లో డిమాండ్ ఉందన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా 200 మంది మత్స్యకారులకు ఉపాధి లభిస్తుందన్నారు. ప్రాజెక్ట్‌ను ఇచ్చినందుకు సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులకు, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే జిల్లా కోర్టు సముదాయాన్ని ఏర్పాటు చేస్తామని, రూ.81 కోట్లతో జీవో మంజూరైందన్నారు. డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి పాల్గొన్నారు.

ఫిష్‌పాండ్ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

హాజీపూర్, (ఆంధ్రజ్యోతి): ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద ఫిష్‌పాండ్ ఏర్పాటుకు ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫిష్‌పాండ్ కోసం 85 ఎకరాల భూమిని సేకరిస్తున్నట్లు తెలిపారు. ఫిష్‌పాండ్ పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 500 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. ఫిష్‌పాండ్ స్థలం గురించి రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా మత్స్యశాఖ ఇన్‌చార్జీ ఏడీ సాంబశివరావు, తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, మండల సర్వేయర్ ఆశిష్, ఆర్ఐ ప్రభు, మత్స్యశాఖ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్ పాల్గొన్నారు.

క్యాన్సర్, ఆయుష్ ఆసుపత్రి నిర్మాణానికి స్థల పరిశీలన

గర్మిళ్ల, (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో క్యాన్సర్, ఆయుష్ ఆసుపత్రి నిర్మాణాల కోసం స్థలాన్ని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 21న మంత్రులు దామోదర రాజనర్సింహా, శ్రీధర్‌బాబు క్యాన్సర్ డయాలసిస్ ట్రామా సెంటర్, ఆయుష్ ఆసుపత్రికి శంకుస్థాపన చేశారని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలందరికు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. చిట్ల సత్యనారాయణ, పట్టణాధ్యక్షుడు తూముల నరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి పాల్గొన్నారు.


మానవాళి మనుగడకు పక్షులు ఎంతో అవసరం



శివ్వారం అభయారణ్యంలో అటవీ శాఖ బృందం

చెన్నూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మానవాళి మనుగడకు పక్షులు, క్రిమికీటకాలు ఎంతో అవసరమని అటవీ శాఖ వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్‌నేచర్ పరిశోధకులు పేర్కొన్నారు. ఆదివారం శివ్వారం మొసళ్ల అభయారణ్యం, గొల్లవాగు, చెన్నూరు అంబేద్కర్ అర్బన్ ఏకో పార్కులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ అంతరించి పోతున్న పక్షులు, కీటకాల జాతులను పరిరక్షించే బాధ్యత అందరిపై ఉందన్నారు. శివ్వారం అభయారణ్యంలో పక్షులను కెమెరాల్లో బంధించారు. డబ్ల్యూడబ్ల్యూఎస్ రీసెర్చ్ పర్సన్‌తో పాటు చెన్నూరు డివిజన్ పరిధిలోని ఎఫ్ఆర్‌వోలు శివకుమార్, అప్పలకొండ, సదానందం, రత్నాకర్‌రావు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వన భోజన మహోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న కమ్మసేవా సమితి సభ్యులు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల కమ్మ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం ఏసీసీ క్వారీలో కార్తీక వన భోజన మహోత్సవం నిర్వహించారు. సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, సమితి అధ్యక్షుడు వినయ్‌కుమార్, అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రావు, దామోదర్, అమూల్‌లు పాల్గొని మాట్లాడారు. వన భోజనాలు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయన్నారు. యువతులు, చిన్నారుల నృత్యాలు అలరించాయి. దాదాపు 1100 మంది కమ్మ బంధువులు పాల్గొన్నారు. వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, కృష్ణమూర్తి, పాల్గొన్నారు.

సింహగర్జన సభకు తరలిరావాలి



మాట్లాడుతున్న మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు

తాండూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మాల ఉపకులాల ఆధ్వర్యంలో నిర్వహించే సింహగర్జన సభకు తరలి రావాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి అన్నారు. ఆదివారం తాండూర్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. సుప్రీంకోర్టు ఎస్సీలలో వర్గీకరణ కోసం తీర్పు వెలువరించిన క్రమంలో మాల, ఉపకులాల జనాభాకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో మాల, మాల ఉపకులాల జనాభా 30 లక్షలకు పైగా ఉన్నారని తెలిపారు. కొన్నేళ్ళుగా మాదిగ సామాజిక వర్గం అధిక జనాభా ఉన్నారని తప్పుడు ప్రచారం చేయడం వల్లనే రాజకీయ పార్టీలు నిజమని నమ్ముతున్నారన్నారు. డిసెంబరు 1న హైద్రాబాద్‌లో జరిగే సభకు మాలలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పేర్కొన్నారు. జాతీయ కార్యదర్శి కాసర్ల యాదగిరి, నాయకులు నర్సింగ్, శ్రీనివాస్, వెంకటస్వామి, పోశం, కొండయ్య, శంకర్, తిరుపతిరావు, శ్రీధర్, వెంకటేష్, పాల్గొన్నారు.

జైపూర్ (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో జరిగే మాలల సింహగర్జన సభ పోస్టర్లను మండల కేంద్రంలో చెన్నూరు నియోజకవర్గ మాల సంఘం అధ్యక్షుడు శీలం వెంకటేష్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ సభకు మాలలంతా పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

సర్వే ప్రక్రియలో వివరాల నమోదు కీలకం

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సర్వేలో ఎన్యూమరేటర్లు సేకరించిన సమాచారాన్ని పోర్టల్‌లో స్పష్టంగా నమోదు చేయడం కీలక ప్రక్రియ అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ డాటా ఎంట్రీ ఆపరేటర్ల ద్వారా సంబంధిత పోర్టల్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సర్వే నమూనాలో సేకరించిన ప్రతి అంశానికి సంబంధించిన వివరాలు నమోదు చేయాలన్నారు. డోర్ లాక్, ఇంటి వద్ద ఎవరు లేకపోతే సమాచారం అందించి వివరాలు నమోదు చేయాలన్నారు. వసతి గృహాల్లో, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ సర్వే ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో మొత్తం 2,54,169 ఇండ్లకు గాను 2,53,423 ఇండ్లను సర్వే చేశామన్నారు. డాటా ఎంట్రీ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చి నమోదు చేయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మోతిలాల్, అధికారులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా డాటా ఎంట్రీ చేయాలి

హాజీపూర్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నిర్వహించిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో తప్పులు లేకుండా నమోదు చేయాలని తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే సూచించారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న డాటా ఎంట్రీని పరిశీలించారు. డాటా ఎంట్రీ ఆపరేటర్లకు పలు సూచనలు చేశారు. మండల పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, ఎంపీఎస్‌వో హన్మేహన్ తదితరులు ఉన్నారు.

దండేపల్లి, (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేను కంప్యూటరీకరణ పారదర్శకంగా నమోదు చేయాలని ఎంపీడీవో ప్రసాద్ సూచించారు. ఆన్‌లైన్‌లో డాటా నమోదు ప్రక్రియను ఆయన పరిశీలించారు. దండేపల్లి మండలంలో31 గ్రామ పంచాయతీలలో 17658 మంది కుటుంబాలను గుర్తించి సర్వే చేపట్టారు. ఆన్‌లైన్ నమోదులో ఎలాంటి తప్పులు దొర్లకుండా నమోదు చేయాలన్నారు.

బీసీలు ఐకమత్యంతో ఉద్యమించాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న బీసీ సంఘం నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : బీసీలు ఐక్యంగా ఉద్యమించాలని కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర నాయకుడు, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నీలకంటేశ్వర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం చార్వాక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కుల గణన నిర్వహించి బీసీలకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా వెనకబాటుతనానికి గురయ్యారని, ఇప్పటికైనా బీసీలు ఏకతాటిపైకి వచ్చి పోరాటాలు చేయాలన్నారు. ఈ నెల 29న తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ జిల్లాలో పర్యటిస్తారని, అనంతరం సభ నిర్వహిస్తామన్నారు. ఆయన పర్యటనను విజయవంతం చేయాలన్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, అధ్యక్షుడు రాంశెట్టి నరేందర్, ఉపాధ్యక్షుడు కిరణ్ , నాయకులు కొమురయ్య, రాజేశం, శ్రీనివాస్‌గౌడ్, రమేష్, శంకర్, రాజు, రాహుల్ , శ్రీనివాస్ తదితరులుపాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కన్నెపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జన్కాపూర్, కన్నెపల్లి గ్రామాల్లో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం బెల్లంపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాదవరపు నర్సింగరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలని సూచించారు. సొసైటీ చైర్మన్ నారాయణ, శ్రీహరిరావు, కన్నెపల్లి, భీమిని మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు పప్పుల రామాంజనేయ, గాదం లక్ష్మీనారాయణ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో విద్యార్థుల ఇబ్బందులు

గర్మిళ్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లో సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం మంచిర్యాల బీసీ బాలుర సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ చలి అధికంగా ఉన్నా విద్యార్థులకు దుప్పట్లు అందజేయలేదని, విద్యార్థులు చలికి వణుకుతున్నారని తెలిపారు. కాలేజీలు దూరంగా ఉండడంతో విద్యార్థులు నడిచి వెళ్తూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. ఉన్నతాధికారులు సమస్యలను పరిష్కరించాలని లేకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అశిష్‌కుమార్,అమోగ్, రాకేష్, తిరుపతి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద శక్తుల నుంచి దేశాన్ని రక్షించాలి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నాయకులు శ్రీనివాస్

గర్మిళ్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మతోన్మాద శక్తుల నుంచి దేశాన్ని రక్షించాలని, ఇందుకు పోరాటాలు చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, పైళ్ల ఆశయ్యలు పేర్కొన్నారు. ఆదివారం మార్క్స్‌భవన్‌లో నిర్వహించిన మతోన్మాద విద్వేశ శక్తుల నుంచి దేశాన్ని రక్షించాలనే సదస్సులో మాట్లాడారు. ఎన్నికల తర్వాత తెలంగాణ ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా బీజేపీ సంఘ్ పరివార్ శక్తులు ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. నాయకులు సంకె రవి, బ్రహ్మనందం, సురేందర్, లాల్‌కుమార్, దేవరాజ్,చంద్రన్న, రంజిత్, శ్రీనివాస్, మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కుల కోసం పోరాటాలు

మందమర్రిటౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): హక్కుల సాధన కోసం చేపడుతున్న పోరాటాల్లో దివ్యాంగులు కదం తొక్కాలని వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ చైర్మన్ పెద్దపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం మందమర్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 26న హైద్రాబాద్ ఇందిరా పార్కు వద్ద చేయూత పెన్షన్‌దారుల ధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావస్తున్నా పింఛన్ పెంచడం లేదని, దివ్యాంగులకు రూ.6 వేల పింఛన్ చెల్లించాలన్నారు. నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలన్నారు. ముల్కల రాజేంద్ర ప్రసాద్, వాసాల రమేష్, కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కవి సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న కవులు

గర్మిళ్ల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓవర్ బ్రిడ్జి సమీపంలోని కృష్ణవేణి పాఠశాలలో ఆదివారం జిల్లా సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. సంస్థ అధ్యక్షుడు దండ నాయకుల వామన్‌రావు, కవి మలయశ్రీలు హాజరయ్యారు. పలువురు కవులు కవితాగానం చేశారు. నబ్బని లక్ష్మీనారాయణ రచించిన ఆటవెలదిలో అమెరికా అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.